క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నిజామాబాద్ అర్బన్: ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫారుక్ హైమద్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ మంజూరు చేసి, ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా జరపాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఖాజా మొయినుద్దీన్, ఇక్బాల్ అన్వర్, రఫీ, అక్బర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

అంతిమ సంస్కారాలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన గంగాధర్ అనే అనాథ శవానికి ఒకటో టౌన్ ఎస్సై ఉదయ్ అనుమతితో బుధవారం దుబ్బ రోడ్డులోని సార్వజనిక్ శ్మశాన వాటికలో అంత్యక్రియలను నిర్వహించామని ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఈసీ మెంబర్ కాసుల సాయి తేజ, అమర్, ఒకటో ఠాణా పోలీస్ సిబ్బంది శశి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



నిజామాబాద్‌నాగారం: బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ కోటి సంతకాల సేకరణలో భాగంగా మంగళవారం 7వ రోజు 44వ డివిజన్ ఖలీల్‌వాడిలో సంతకాల సేకరణ నిర్వహించారు. బీసీ యువత, బీసీ నాయకులు బీసీ ఆడబిడ్డలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరడి లక్ష్మణ్, షకీల్ అహ్మద్, గంగాధర్ గౌడ్, గంగాధర్, సూర్య వంశీ, లక్ష్మణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ తనిఖీ



ఖలీల్‌వాడి: నగరంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ(బాలుర)లను మంగళవారం డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులను, పడకగదులను, స్టోర్‌రూమ్‌ను, కిచెన్‌రూంలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, అడ్వొకేట్ జాఫాన్ రజ్వీ, ఫాహిద్ రజా, ఉపాధ్యాయ బృందం తదితరులున్నారు.

వరి పంటల పరిశీలన



జక్రాన్‌పల్లి: బ్రాహ్మణ్‌పల్లి, తొర్లికొండ, అర్గుల్ గ్రామాల్లో వరి పంటలను మండల వ్యవసాయ అధికారిణి దేవిక మంగళవారం పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగు ఆశించినట్లు ఆమె తెలిపారు. వ్యవసాయ అధికారుల సలహాల మేరకు మందులు చల్లుకోవాలని సూచించారు. పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులు వేయకూడదని తెలిపారు. అదేవిధంగా పీఎం కిసాన్ పథకంలోని లబ్ధిదారులు ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. ఏఈవోలు శివ, సుభాష్యా, వెంకటేష్ తదితరులున్నారు.

ప్రేమికులారా ఏకంకండి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ప్రేమికుల దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రపంచ ప్రేమికులారా ఏకం కావాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం ప్రేమించుకునే హక్కు ఉందని, కానీ దీనిని కొంతమంది మతోన్మాదులు వ్యతిరేకిస్తూ దాడులు చేయడం సరైనది కాదన్నారు. ప్రేమ వల్ల కులాంతర మతాంతర వివాహాలు జరుగుతాయని కుల వివక్ష పోతుందని అన్నారు.

ఇంటి పన్నులు చెల్లించండి

వర్ని: ఫిబ్రవరి నెల ఆఖరి వరకు పంచాయతీ పరిధిలో ఉన్న ఇంటి యజమానులు ఇంటి, కులాయి పన్నులు చెల్లించాలని సత్యనారాయణపురం పంచాయతీ కార్యదర్శి సాయిలు కోరారు. గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు.

ఆరోగ్యానికి సైకిల్ సవారీ!

- డీఎంహెచ్‌వో సుదర్శనం
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి నెలా 14న ఆరోగ్య మేళా



సైకిల్ తొక్కుతున్న వైద్యశాఖాధికారి సుదర్శనం, ఇతర సిబ్బంది

నిజామాబాద్ సిటీ: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెలెనెస్ సెంటర్లలో మంగళవారం ఆరోగ్య మేళ నిర్వహించారు. ప్రతి నెలా 14న నిర్వహించే ఆరోగ్య మేళాలో ఒక నినాదం ఇస్తారు. అందులో భాగంగా ఈ నెల ఆరోగ్యం కోసం సైకిల్ తొక్కండి అనే నినాదాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక దుబ్బ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య మేళా కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో) ఎం సుదర్శనం హాజరై సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఆరోగ్య మేళాలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో అమ్మ ఒడి, యోగా, జుంబా, మెడిటేషన్, తదితర కార్యక్రమాలతోపాటు టెలీ కన్సల్టేషన్, జీవనశైలి వ్యాధులను పరీక్ష చేయడం, క్షయ వ్యాధి మందుల పంపిణీ, పాలియేటివ్ కేర్ సేవలు, జిల్లా వ్యాప్తంగా 141 హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లతోపాటు 40 పీహెచ్‌సీ, యూపీహెచ్‌ఎస్‌లలో కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రజలు ఆరోగ్య అలవాట్లను పాటిస్తూ మంచి పోషకాహారం, స్వచ్ఛమైన తాగు నీరు తీసుకుంటే ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చన్నారు. షుగర్, క్షయ లాంటి వ్యాధుల్ని అరికట్టినప్పుడే ఈ సమాజం ఆరోగ్యవంతంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో దుబ్బ యూపీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలత, గిరిరాజ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ సునీత, జిల్లా ఆరోగ్య విద్యా బోధకులు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఈవో గోవర్ధన్, వైద్య ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో అవగాహన

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని న్యాల్‌కల్ గ్రామంలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ పథకంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సైకిల్ ర్యాలీని సర్పంచ్ గంగా ప్రసాద్ ప్రారంభించారు. 30 ఏళ్లు పైబడినా ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యసిబ్బంది వివరించారు. బీపీ, షుగర్, క్షయ లాంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి సతీష్ కుమార్, వైద్య, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న సర్పంచ్ గంగా ప్రసాద్

‘మంచిప్ప’ పాత డిజైన్‌కు మద్దతు

బీజేపీ నేత కులాచారి దినేశ్



మోపాల్‌లో మాట్లాడుతున్న కులాచారి దినేశ్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మంచిప్ప ప్రాజెక్టు పాత డిజైన్‌కే బీజేపీ మద్దతు తెలుపుతోందని, కేవలం కమీషన్ల కోసమే రీడిజైన్ చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కులాచారి దినేశ్ పేర్కొన్నారు. మంగళవారం మోపాల్, కంజర, కులాస్‌పూర్, చిన్నాపూర్, బాడ్సి, సింగంపల్లి గ్రామాల్లో ప్రజా గోస– బీజేపీ భరోసా శక్తికేంద్రాల కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ 9 ఏళ్ల పాలనలో ఎమ్మెల్యేలు వందల కోట్లకు పడగలెత్తారని, దేశంలోనే అత్యంత ధనిక సీఎంలలో కేసీఆర్ కుటుంబం ఒకటని విమర్శించారు. బాజిరెడ్డి గోవర్ధన్ ఎమ్మెల్యేగా ఉండి వందల కోట్లు సంపాదించారని, ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ కోసం వందల కుటుంబాలను ముంపునకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రీడిజైన్‌తో ఆయకట్టు పెరగకపోగా, రూ.2500 కోట్ల వ్యయం పెరిగిందని, అందుకే పాత డిజైన్ ప్రకారమే పనులు చేపట్టాలని డిమాండ్‌చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 8 ఏళ్లలో 3 కోట్ల ఇళ్లకు నిధులు మంజూరు చేసిందని, అన్ని పంటలకు మద్దతు ధర చెల్లిస్తుందని తెలిపారు. ప్రపంచంలోనే భారత్‌ను విశ్వగురువుగా తీర్చిదిద్దారని, కరోనా టీకాలను 200లకుపైగా దేశాలకు సరఫరా చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. పలువురు నాయకులు బీజేపీలో చేరారు. నాయకులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, గద్దె భూమన్న, పద్మారెడ్డి, ద్యాప రవి, ఎమ్మారెడ్డి, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలియజేస్తున్న ట్రెసా ప్రతినిధులు



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతు

సుభాష్‌నగర్: జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ట్రెసా) ప్రతినిధులు మంగళవారం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ట్రెసా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ప్రశాంత్‌కుమార్, రెవెన్యూ ఉద్యోగులు వేణుగోపాల్ గౌడ్, సతీష్‌రెడ్డి, వీర్‌సింగ్, భూపతి ప్రభు, పవన్, తహసీల్దార్లు ఉన్నారు. అలాగే టీఎస్‌డబ్ల్యూ చైర్‌పర్సన్ ఆకుల లలిత, కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు

డైరీ ఆవిష్కరణ

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం డైరీని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, జిల్లా ఏఈవోల సంఘం అధ్యక్షులు భాస్కర్, ప్రధాన కార్యదర్శి లక్‌పతి పాల్గొన్నారు.

దళారుల దోపిడీతో రైతులకు తీవ్ర నష్టం



మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న నాయకులు

ఖలీల్‌వాడి: పసుపు మార్కెట్‌లో దళారుల దోపిడీతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, సీఎం కేసీఆర్, మంత్రులు నిరంతరం మార్కెట్లను పర్యవేక్షించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. మంగళవారం మార్కెట్‌ను సందర్శించి పసుపు రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శోభన్ మాట్లాడుతూ మార్కెట్‌లో పసుపునకు సరైన ధరలేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రయివేటు వ్యాపారులు పసుపు క్వింటాలుకు రూ.5 వేల నుంచి రూ.5,675లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. మార్కెట్‌లో రైతులకు రూ.5కే భోజనం అందించాల్సి ఉన్నా దాన్ని నిలిపివేశారు. వెంటనే ప్రారంభించాలన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నేతలు

సుభాష్‌నగర్: ఆదివాసి, గిరిజన, దళిత పేదలు సాగు చేసుకుంటున్న పోడు, సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. అటవీ సంరక్షణ నియమాలు–2022ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. పోడు భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే యత్నం మోదీ సర్కారు చేస్తోందని ఆరోపించారు. జిల్లాలో వేలాది ఎకరాలు పార్ట్–బిలో ఉన్నాయని, వారందరికీ పాస్‌బుక్కులు ఇచ్చి, రైతుబంధు అందజేయాలని డిమాండ్ చేశారు. సిరికొండ, గడ్కోల్, మెంట్రాజ్‌పల్లిలోని 532, 100, 246 సర్వేనెంబర్లలో గత ప్రభుత్వాలు పట్టాలు ఇచ్చినా ఫారెస్ట్ అధికారులు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్నారని, హైకోర్టు ఉత్తర్వులను కూడా ఉల్లంఘిస్తున్నారన్నారు. ధరణి పోర్టల్‌లో అనేక అవకతవకలు ఉన్నాయని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. నాయకులు అగ్గు ఎర్రన్న, దాసు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం



దుబ్బాకలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌టీఐ పారు

ధర్పల్లి: సురక్షిత ప్రయాణం కోసం ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని ఆర్మూర్ ఆర్టీసీ డిపో ఎస్‌టీఐ పారు తెలిపారు. దుబ్బాకలో ప్రజల వద్దకు ఆర్టీసీ బస్సు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో ఎస్‌టీఐ మాట్లాడుతూ. ఆర్టీసీ అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు మరింత చేరువ కావడానికి బస్సు ట్రాకింగ్ సిస్టం రూపొందించిందని తెలిపారు. పెళ్లిళ్లు, శుభకార్యాలకు ఎటువంటి డిపాజిట్ లేకుండా 10 శాతం రాయితీతో అద్దె బస్సులను బుకింగ్ చేసుకోవచ్చని వెల్లడించారు. మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి ఆర్మూర్ నుంచి బస్ సర్వీసులు నడిపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్, ఉప సర్పంచ్ ప్రతాప్ గౌడ్, వీడీసీ చైర్మన్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల వార్షికోత్సవం



బహుమతులు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాజియోద్దీన్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్ట పడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించి కళాశాలకు గొప్ప పేరు తీసుకురావాలన్నారు. కళాశాల వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఆట పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఫ్రెషర్స్ పార్టీని కూడా నిర్వహించారు.

ముగిసిన క్రీడలు



మాట్లాడుతున్న సీఐ నరేష్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని విజయ్‌స్కూల్‌లో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ నరేష్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. సెల్‌ఫోన్‌లో ఆటలు కాకుండా క్రీడా మైదానాల్లో ఆడితే దేహదారుఢ్యం, మానసిక ప్రశాంతత వస్తుందన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. అనంతరం గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ అమృత లత, కరస్పాండెంట్ ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్లు వసంత, సుజాత, ప్రిన్సిపాల్ విజేత పాల్గొన్నారు.

పోస్టల్ సేవల్ని సద్వినియోగం చేసుకోవాలి



డిచ్‌పల్లి: పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేల్ ఓవర్సీర్ స్నేహిత్, డిచ్‌పల్లి ఆర్ ఎస్ పోస్ట్‌మాన్ విజయ్ సూచించారు. మంగళవారం డిచ్‌పల్లి మండల కేంద్రంతో పాటు ఘన్‌పూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించి పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రికరింగ్ డిపాజిట్స్, సుకన్య సమృద్ధి యోజన, అతి తక్కువ ప్రీమియంతో ఎక్కువ మొత్తంలో బీమా సౌకర్యం, సేవింగ్ అకౌంట్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై పెరిగిన వడ్డీరేట్లు తదితర అంశాల గురించి వివరించారు. బీపీఎంలు గోవర్ధన్, రవి, సదానంద్, లత, సింధూజ, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో విజయం తథ్యం



నిజామాబాద్ సిటీ: కచ్చితమైన సమయపాలన, మంచి అలవాట్లతో ప్రతి ఒక్కరూ విజయం సాధిస్తారని రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్ ఆకుల తెలిపారు. మంగళవారం కుమార్‌గల్లీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ‘పరీక్షల ఒత్తిడిని జయించడం ఎలా’ అనే అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అందజేసి పరీక్షలలో విజయం సాధించాలన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు సతీష్ సాహు, సభ్యులు శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది చంద్రశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు నలుగురి ఎంపిక



మొగులాజీ దీక్షిత్ హర్షిత సన్నిధి

నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 10 నుంచి 12వ వరకు ఆర్మూర్ విజయ హైస్కూల్‌లో నిర్వహించిన 41వ తెలంగాణ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు మొగులాజీ, దీక్షిత్, హర్షిత, సన్నిధిలు తెలంగాణ జట్టుకు ఎంపికయ్యారు. జాతీయస్థాయి టోర్నీ ఈ నెల 16 నుంచి 20 వరకు మంచిర్యాల జిల్లాలో జరగనుంది.

ఘనంగా ఎల్లమ్మదేవి బోనాల పండుగ



నిజామాబాద్ సిటీ: నగరంలోని ఎల్లమ్మగుట్ట ఎల్లమ్మదేవి అష్టమ వార్షికోత్సవాలు బోనాల పండుగతో ఘనంగా ముగిశాయి. ఈ నెల 10 నుంచి 14వరకు ఎల్లమ్మదేవి అష్టమ వార్షికోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించినట్లు కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంచరెడ్డి ఎర్రన్న, పంచరెడ్డి చిన్న శంకర్‌లు తెలిపారు. బోనాల సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చివరిరోజు ఎంపీ ధర్మపురి అర్వింద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ ఆలయంలో అమ్మవారిని దర్శించుకోగా, తెలంగాణ రాష్ట్ర మహిళ కార్పొరేషన్ అభివృద్ధి చైర్‌పర్సన్ ఆకుల లలిత బోనం ఎత్తుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇందూర్ యువత మండల కమిటీ ఏర్పాటు



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు తెలిపారు. ఈ సందర్భంగా సాయిబాబు మట్లాడుతూ.. యువతను సేవా కార్యక్రమాల్లో మమేకం చేసేందుకే మండలాల వారీగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం నిజామాబాద్ రూరల్ మండలం తిర్మన్‌పల్లి గ్రామ రైతు వేదికలో నిజామాబాద్ రూరల్ మండల నూతన కమిటీ సభ్యులను నియమించినట్లు తెలిపారు. మండల కమిటీ సమన్వయకర్తలుగా ఇందూరు అభిలాష్, ఇందూరు శేఖర్, రాచర్ల రాజేష్, ఇన్‌చార్జులుగా అనిల్, రాకేష్, వినోద్, ప్రతాప్‌లను నియమించామన్నారు. మిగతా వారు సభ్యులుగా కొనసాగుతారని సాయిబాబు తెలిపారు.

సైన్స్ ప్రతిభా పరీక్ష



ఇందల్వాయి: తిర్మన్‌పల్లి ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ప్రతిభా పరీక్షను మంగళవారం నిర్వహించారు. ప్రథమ స్థానంలో ఎల్లారెడ్డిపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన అభినయ్, ద్వితీయ స్థానంలో గన్నారం ఉన్నత పాఠశాలకు చెందిన గౌతమి నిలిచినట్లు హెడ్ మాస్టర్ రాజన్న తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	58,350	వెండి (కిలో)	70,500
22 క్యారెట్స్	53,790	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	14	30	క్యాప్సికం	30	50
బెండకాయ	60	80	గాజరుగడ్డ	20	40
బీరకాయ	50	60	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	30	50	దోసకాయ	30	50
బీర్నీసుకాయ	25	50	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	30	50	గోబిపువ్వు	25	40
పాలకూర	15	30	బీట్‌రూట్	20	40
మెంతికూర	20	40	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	35	60
పుదీనా	40	60			

- ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్–1– అమిగోస్,(తెలుగు)– 1.30,4.30 7.30,10.30
స్క్రీన్–2– అమిగోస్–(తెలుగు)–10.45
పఠాన్(హిందీ)–1.30, 4.30,10.30
నువ్వొస్తానంటే –నేనొద్దంటానా...–7.25
స్క్రీన్–3– వాల్తేరు వీరయ్య –1.30,4.30
రైటర్ పద్మభూషణ్ –7.40,10.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1– అమిగోస్–(తెలుగు) –10.30 1.30,4.30,7.30,10.30
స్క్రీన్–2 – రైటర్ పద్మభూషణ్ –11.20,2.00 8.00,10.40
వాల్తేరు వీరయ్య–4.40
స్క్రీన్–3– నువ్వొస్తానంటే–నేనొద్దంటానా–12.10
పఠాన్–(హిందీ)–3.30,6.45,10.00
స్క్రీన్–4– చెడ్డీ గ్యాంగ్–(తెలుగు)–1.40
నువ్వొస్తానంటే –నేనొద్దంటానా–4.35
వసంత కోకిల –7.55
దిల్‌వాలే దుల్హానియా లేజాయింగే –(హిందీ)–10.20

దేవి	అమిగోస్
నటరాజ్	పఠాన్ (హిందీ)
లలితామహల్	వాల్తేరు వీరయ్య
శ్రీదేవి	దేశం కోసం
విజయ్	వారసుడు